# ఆమె మొలకెత్తిన నేల

లక్ష్మి మిట్టల్ రెస్ట్‌హౌస్ ఫస్ట్ ఫ్లోర్‌లోకి అడుగు పెట్టేసరికి అక్కడి వాతావరణం హుషారుగా కనిపించింది.

తల్లి ఎంత బుజ్జగించినా ఏడుపాగని ఓ చంటిపాప ముందు నిల్చుని "చిన్నకుట్టీ చిన్నకుట్టీ.." అంటూ రాగయుక్తంగా పాడుతూ అభినయిస్తోంది స్వీపర్ జానకమ్మ. ఆజానుబాహురాలైన ఆమె శరీరపు కదలికలు, మాటలు అందర్నీ ఆనందింపజేస్తున్నాయి.

కొంతసేపటికి పాప సైతం ఏడుపు చాలించి తల్లి భుజం మీంచి జానకమ్మకేసి ఆసక్తిగా చూస్తూండిపోయింది.

"చిన్.. న్.. న్...న్న కుట్టీ.." చుప్‌న పాప బుగ్గల మీద ముద్దాడి తన ర్యాక్ వద్దకెళ్లింది ఆమె.

ప్యాంటు స్థానంలో లుంగీ చుట్టుకొని బాత్రూం కేసి నడుస్తూ కిచెన్‌లోకి తొంగి చూశాను.

ఎలక్ట్రికల్ స్టౌల ముందున్న ఐదారుమంది ఆడాళ్ల మధ్య ఇందిర కూడా కన్పించటంతో లోపలికి నడిచాను.

"ఏం జేస్తున్నావు?" అడిగాను.

"బువ్వయింది. కూరాకు ఉడుకుతాంది.." స్టౌ మీది పాత్రలో గరిట తిప్పుతూ చెప్పింది.

పంటి కింది రాతిలా కలుక్కుమంది ఆమె మాట.

"అన్నమనవ్వేవా?"లో గొంతుకతో అసహనం ధ్వనించేలా అన్నాను - అటు ఇటు నిల్చుని వున్న ఆడాళ్ల కేసి చూస్తూ.

"ఏం? - అట్లంటే బువ్వకు రుసొస్తదా!" ఎదురు ప్రశ్నించింది ఇందిర. "వాళ్లెవురికీ మన మాటర్రావులే" చెప్పింది నవ్వుతూ.

పేరు మార్చితే బువ్వకు రుచి రావటం కాదుగాని, మాటకు రుచొస్తుందని ఆమెకు చెప్పబోయానుగాని విన్పించుకోలేదు.

ఇప్పటిదాకా ఇంటి నుంచి తెచ్చుకొన్న పచ్చళ్లు, పొడులు, నెయ్యితోనే గడిపాము. చుట్టుపట్ల వాళ్లను చూసి యీరోజు తనూ పులుసు కూర చేస్తోన్నట్లుంది ఇందిర.

బాత్రూం కెళ్లి శుభ్రపడి హాల్లోకొచ్చి మా పడకల వద్ద కూచున్నాను.

పక్కనే.. పక్షవాతం సోకిన ఓ చేతిని కాలును రుద్దుకొంటూ బావమరది చంద్ర.

"ఏమప్పా! పన్జరిగెనా!" జానకమ్మ అడిగింది.

"లేదమ్మా!" చెప్పాను.

డాక్టర్ల గురించి ఆమె ఏదో చెబుతూ వుండగానే కిచెన్ రూంలోంచి వంటపాత్రలతో వచ్చింది ఇందిర.

ఆమెను చూడగానే "నీ పెండ్లాం.. నన్నుదా ఆటపట్టించెగదప్పా!" ఫిర్యాదు చేసింది జానకమ్మ.

"నిన్నా!" ఆశ్చర్యాన్ని అభినయించాను. "ఆటపాటల్లో నువ్వుదా.. రొంబ ఎక్స్‌పర్ట్‌వు గదా! నిన్నాటపట్టించేదెవరు?" అన్నాను.

"పోప్పో!" ఎర్రటి ఆమె యాభై యేళ్ల శరీరం సిగ్గులతో మెలికలు తిరిగింది. "నువ్వుందా.. మా మురుగన్‌లా మాట్లాడుదువు.." అంది.

అప్పటికే కొందరు భోజనాలకు కూచున్నారు.

ఇంకొందరు హాస్పిటల్‌లోని పేషంట్ల కోసం క్యారియర్లు సిద్ధం చేసికొంటున్నారు.

"మీరు బువ్వ జేసికొన్నెరా!" ఎవర్నో అడుగుతోంది ఇందిర.

తలెత్తి చూశాను.

ఒళ్లంతా బీదరికం తాండవిస్తోన్న ఓ నడిప్రాయపు జంట.

"పొద్దున్నే రొట్టెల్దిన్నెం తల్లీ! మాపిటేల కరెంటు పొయ్యి తెచ్చుకోవాల - సెరవల్దెచ్చుకోవాల..." చెబుతున్నాడు అతను.

"ఇప్పుడు పస్తులుంటారా?"

"వూర్నుంచొస్తా రొట్టెల్దెచ్చుకొన్నెం.. రేత్రి తినంగా మిగిలింటే పొద్దున్నే తిన్నెం... రేత్రి తినంగా మిగిలింటే పొద్దున్నే తిన్నెం..." వాళ్ల మాటల్లో అనివార్యపు ఉపవాసం కన్పిస్తోంది.

వాళ్లకేసి ఎగాదిగా చూసి "బియ్యముందాయా?" అడిగింది.

"ఇంటికాన్నుంచి తెచ్చుకొన్నెం..."

మా ముందు విస్తర్లు పరిచింది ఇందిర. సెరవలో అన్నాన్ని విస్తర్లలో కుమ్మరించింది. ఖాళీ పాత్రను వాళ్లకేసి చూస్తూ "ఎవుర్నన్నా స్టవ్వడిగి బువ్వజేసుకోపోండి.. మా స్టవ్వుకు తీగె కాలిపోయిండే నేను కూడా ఆ యమ్మను అడిగి ఇప్పించుకొన్నా.." చెప్పింది.

సెరవ అందుకొన్నారుగాని స్టౌ కోసం ప్రయత్నించలేదు వాళ్లు. మౌనంగా కూచుని వున్నారు.

ఈ పూట నిజంగానే వాళ్లకు ఆహారం అవసరం లేదేమో!

"అంత నోరు సచ్చినోళ్లయితే ఎట్టా?" అంటూ తనే పూనుకొని ఆ వరస యీ వరస పడకల్లోని ఆడవాళ్లవద్దకెళ్లి స్టౌ కోసం ప్రయత్నించింది ఇందిర. "పాపం! వాల్లు బువ్వ జేసుకోలేదంట..." అంటూ జాలిగా అడిగింది.

నలుగురు ఆడాళ్లనయినా ప్రాధేయపడి వుంటుంది.

చివరకు విసుక్కొంటూనే స్టౌ యిచ్చింది ఓ కన్నడిగురాలు.

నాక్కొంత అసహనమేసింది.

తను అందర్నీ అడుగుతోంటే - అవసరం ఉన్నవాళ్లు మాత్రం దీనత్వాన్ని పెట్టుబడిగా పెట్టి కూచోవటం, స్టౌ అందగానే కిచెన్‌లోకి వెళ్లటం.. ఇదంతా నాకే కాదు, చుట్టుపట్ల ఆడాళ్లకు కూడా కొంత ఎబ్బెట్టుగా అన్పించినట్లుంది. వింతగా చూస్తున్నారు.

"కూరేం జేసుకొన్నెవూ?" జానకమ్మ దగ్గరగా వెళ్లింది ఇందిర.

"ఏముంది? సాంబార్..."

"మా కూర తిను..." అంటూ ఆమె వద్దంటున్నా గిన్నె తీసికెళ్లి రెండు గరిటెల కూర పళ్లెంలో వేసి వచ్చింది.

స్టౌ యిచ్చిన కన్నడిగురాల్ని అడిగింది" కూర
కావాలా?" అంటూ సైగలతో.

ఆమె మొహంలో కొంత సిగ్గులాంటి భావం కదలాడింది. బహుశా కూర కూడా చేసికోలేని వాళ్ల కింద తమను జమ చేస్తోందేమోననే అనుమానం ఆమె కళ్లల్లో. "బేడా.. బేడా.." అంటూ చేతులతోనే వారించింది.

ఇందిర మీద నాక్కోం వచ్చింది గాని, అంతమందిలో మందలించేందుకు సంస్కారం అడ్డొచ్చింది.

వారం రోజులుగా పచ్చళ్లతో రాపెక్కిన నాలుక, పులుసు కూరను ఆహ్లాదంగా ఆస్వాదించింది.

అన్నం వడ్డిస్తూ అంది "ఏం మాసులో ఏమో! అట్ట జూడు.. సాటు జేసుకొని ఆ తినడం సూడు... దాపెట్టుకొని తింటండారు సూడు... ఇంతమందిమి ఇన్ని కుండలు బెట్టి యిన్నిన్ని రకాల కూరలు, కూడు వండుకొని, ఒక తావున కూకొని కూడా దాపెట్టుకొని తినేంత గాచారమెందుకు పట్టిందో? యానుంచేనుంచో వొచ్చినోల్లం... అందరికీ అన్నీ వుండవుగదా! అందరం కలిసి కూరలు కూడు పంచుకొని తింటే ఎంత రుచి! ఖర్మ.. ఖర్మ.." అంది నుదుటిమీద అరచేత్తో చరుచుకొంటూ.

ఆమెకేసి ఎగాదిగా చూశాను.

చంద్ర ముసిముసి నవ్వులతో భోంచేస్తున్నాడు. అక్కగారి అభిరుచికి సంతోషపడుతున్నాడు కాబోలు.

ఊరంతా ఒకచోట కూడి, అన్నాలు వండుకుతినటం పల్లె సంస్కృతిలో ఆమె ఒక్క వనభోజనాల సమయంలో చూసి వుండొచ్చు. అదెంతో ఆనందకరంగా, ఉత్తేజకరంగా వుండే బోనాల కార్యక్రమం. రోగిస్టులతో కూడిన యీ స్థలం కూడా అలాగే ఉండాలని కోరుకోవటం ఆమె అమాయికత్వానికి పరాకాష్టగా అన్పించింది.

అన్నం చేసికొన్న తర్వాత స్టౌ తెచ్చి మా పడక వద్ద ఉంచారు వాళ్లు.

"అదా.. ఆ ఎర్రచీరామెకు యిచ్చిరా.." చెప్పింది ఇందిర.

అటువంటి ప్రయత్నమేమీ చేయకుండా మళ్లీ దీనత్వం మార్చు ముఖాలతో కూచుండిపోయారు వాళ్లు.

ఇందర ఏం చేయబోతోందని ఆసక్తిగా చూస్తోన్న నన్ను ఆశ్చర్యానికి గురిజేస్తూ తనే స్టౌ తీసికెళ్లి కన్నడిగురాలికి ఇచ్చి వచ్చింది. అంతటితో వూరకుందా! "ఇంత మొగమాటస్తులయితే ఎట్ట బతుకుతరూ?" అంటూ జాలిని కూడా వొలకబోసి నన్ను చిరాకులో నివ్వెరబోయేలా చేసింది.

***

నిమ్‌హెన్స్ హాస్పిటల్‌లోని న్యూరాలజి ప్రొఫెసర్ డా॥సిద్ధిఖిని కలిసేసరికి రాత్రి తొమ్మిది గంటలైంది.

రెండేళ్ల క్రితం మెదడులో నరాలు చిట్లి పెరాలసిస్ వచ్చింది బావమరిది చంద్రకు. అప్పుడు ఇక్కడే అతని తలకు ఆపరేషన్ జరిగింది. గడ్డ కట్టిన రక్తాన్ని తొలగించారు గాని ఇంకా ఎక్కడో కొంత మిగిలింది. కాలు చేయి పూర్తిగా స్వాధీనంలోకి రాలేదు. ఫిజియోథెరపీ ద్వారా బాగవుతుందని అంటారు వాళ్లు. మరోసారి ఆపరేషన్ ప్రాణానికి ముప్పంటారు. ఆ మాటల్ని చంద్ర నమ్మటం లేదు. హోసూర్ రోడ్‌లోని మణిపాల్ హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ ఇప్పించమంటున్నారు. నిమ్‌హెన్స్‌లోని అంజియోగ్రాం రిపోర్ట్ తెస్తే పదివేలు తగ్గుతుందంటున్నారు.

అందుకే... ఆ రిపోర్ట్ కోసమే యీ డాక్టర్ల చుట్టూ తిరుగుతున్నాను.

మిట్టల్ రెస్ట్ హౌస్‌లో వసతి సౌకర్యాలు బాగున్నాయి.

విద్యుత్ స్టౌల మీద వంట, వేడినీటి షవర్ స్నానం, ఆధునిక సౌకర్యాలున్న లావెటరీస్, దోబీఖానా, ఫిల్టర్ వాటర్, 73 సెం.మీ. కలర్ టి.వి.లు, బాత్రూం లెట్రిన్స్‌ను రోజుకు మూడుసార్లు శుభ్రం చేసే స్వీపర్ల వ్యవస్థ, వెరసి మనిషికి ఐదు రూపాయల స్వల్ప రుసుం మాత్రమే చెల్లించి సౌకర్యాలన్నీ అనుభవించొచ్చు. ఎటొచ్చీ కింద పడుకోవటమే నాక్కొంత ఇబ్బందికరంగా వుంది. అలవాటు లేకపోవటం పడక వేస్తూండటం వలన గంటకోసారి హాలంతా వూడుస్తుంటారు.

రెస్ట్ హౌస్‌లోని జనాలందరితో కలవాలనీ, వాళ్లను తనతో కలుపుకుపోవాలనీ తెగ తాపత్రయపడుతోంది ఇందిర.

జానకమ్మలాంటి కొందరు స్వీపర్లు ఆమెతో కలిసిపోయారు.

క్యాంటిన్ వద్దా, లైబ్రరీల్లో... అక్కడక్కడా పన్జేసే స్వీపర్లు కూడా రాత్రయ్యేసరికి ఇక్కడికే వచ్చి పడుకుంటారు.

రాత్రి పదకొండు గంటలైనా పగలబడి నవ్వుతూనే వుంటారు.

పేషంట్ల తాలూకు మనుషులంతా వాళ్లకేసి వింతగా చూస్తుంటారు.

ఇందిరలాగా వాళ్లతో కలిసి వాళ్ల నవ్వుల్లో పాలుపంచుకొన్న ఆడమనిషి నా కళ్లలో పడలేదు. బహుశా స్వీపర్లనే తేలికభావం వాళ్ల మనస్సుల్లో ఉందేమో! మరి... ఇందిరకు ఆ తక్కువదనం ఎందుకు స్ఫురణకు రాలేదు?

ఉదయం పదిగంటల సమయంలో ఓ.పి. మీదుగా న్యూరాలజి సెంటర్‌కేసి వెళ్తోంటే అనంతపురం పేషంట్ ఒకతను పరిచయమయ్యాడు. డాక్టర్ల గురించి అడిగేందుకు నావద్దకొచ్చి మాటలు కలపడంతో దగ్గరయ్యాడు.

అతని జబ్బు గురించి వినగానే ఆశ్చర్యం కలిగింది.

ప్రపంచంలో ఇలాంటి జబ్బులు కూడా వుంటాయా అన్పించింది.

ఉన్నట్టుండి విపరీతంగా నవ్వొస్తుందిట అతనికి. అదేనట జబ్బు.

నేనింతదాకా "నవ్వటం వర"మనుకొన్నానుగాని అది జబ్బుగా కూడా ఉంటుందని ఎప్పుడూ వూహించలేదు.

మిట్టల్ రెస్ట్ హౌస్ గురించిన సమాచారం అతనికి చెప్పి న్యూరాలజి విభాగం కేసి వెళ్లాను.

సాయంత్రం ఇందిరను తీసికొని షికారుగా 'లక్సంద్ర' దాకా ప్రయాణమయ్యాను.

నిమ్‌హెన్స్ క్యాంటిన్ వద్ద పురాతనమైన పనస చెట్టునీ, దాని కొమ్మల మొదళ్లకు పసిపిల్లల్లా కరచుకొని వేలాడే పనసకాయల్ని చూపించి ఆమెను ఆశ్చర్యపరిచాను. లైబ్రరీ వద్ద విస్తారంగా పరచుకొన్న పచ్చిగడ్డి పార్కులో బెంచీలమీద కూచున్న జంటల్ని చూడమంటూ సైగ చేశాను.

ఇందిర చూపులు అటు మళ్లాయి.

ఆమె కళ్ల నిండా ఆశ్చర్యం.

గేటు దాటిందాకా పచ్చిగడ్డి పార్కుకేసి చూపుల్ని విహంగాల్లా తిప్పసాగింది.

'ఎప్పుడూ నువ్వే దేశాల్దిరుగుతుంటావు. నన్నొకసారన్నా తీసప్పోతేం?' అని ఇందిర అప్పుడప్పుడూ అంటుండేది.

అవకాశమొచ్చింది కాబట్టి బెంగళూరు తెచ్చాను.

తిరిగి వెళ్లేలోగా దర్శనీయ స్థలాలన్నీ చూపించి కొత్తదనంతో ఆమెను ఉక్కిరిబిక్కిరయ్యేలా చేయాలని మనస్సులో వుంది. అంతేకాకుండా ఇక్కడి నవనాగరికతను పరిచయం చేసి ఆమెలోని పల్లెటూరి మొరటుదనం కొంతైనా తగ్గించాలని వుంది. కొత్త వాళ్లెవరైనా ఇంటికొచ్చినపుడు ఆమె అనాగరికపు మాటలూ, ప్రవర్తనా నాకొంత ఇబ్బందికరంగా వుంది.

ఈ చిన్న పార్కులోని జంటల్నే ఇంత అబ్బురంగా చూసే యీవిడ లాల్‌భాగ్, కబ్బన్ పార్క్, జ్యూ పార్క్, సాయంకాలపు ఎం.జి రోడ్ వాతావరణం చూస్తే మరెంత ఆశ్చర్యపడుతుందోగదా అన్పించింది.

గేటు దాటుతూ కూడా వెనక్కి తిరిగి చూస్తూనే వుంది ఇందిర.

జంటల గురించి ఏమైనా వ్యాఖ్యానిస్తుందేమో అనుకున్నాను.

"ఆ తావంతా ఎవరిది?" అడిగింది.

"ఇంకెవరిది, హాస్పిటల్ వాళ్లదే!" చెప్పాను.

కొద్ది క్షణాల మౌనం తర్వాత అంది "వాల్లకు గొడ్లుండాయా?" అని.

నా నొసలు ముడివడ్డాయి. "హాస్పిటల్ వాళ్లకు గొడ్లెందుకుంటాయి?" అన్నాను.

"లేకుంటే మరి.. అంతంత కయ్యలు పచ్చిగడ్డి ఎందుకు పెంచుకుంటా వుండారు?" ప్రశ్నించింది. "యీ గడ్డి బరుగొడ్లకు కోసి బేస్ఫే ఎంత కమ్మగా తింటాయో!... అడిగినన్ని పాలిస్సాయి.. యీ గడ్డి మనకుంటేనా.. ప్చ్.." నిట్టూర్చింది.

నాకయితే నిలువుగుడ్లు పడ్డాయి.

అంటే.. ఇంతదాకా ఆమె పార్కులోని జంటల్ని గమనించలేదన్న మాట. పచ్చిగడ్డి అందాల్నే చూస్తోందన్న మాట.

ఆమె దృష్టి కోసం పట్ల ఓవైపు నవ్వొస్తూ వుంది. మరోవైపు కోపంతో కూడిన బాధగానూ వుంది.

★★★

రాత్రి భోజనాలయింతర్వాత మణిపాల్ హాస్పిటల్ వెళ్లే విషయాన్ని గురించి చంద్రతో ఆలోచిస్తున్నాను. మా చర్చల్లో భాగస్వామిని చేద్దామనుకొంటే ఇందిర అందుబాటులో లేదు. రెస్ట్‌హౌస్‌లోని ఆ పడక వద్ద కెల్లి కొంతసేపు కూర్చుంటుంది. ఈ పడక వద్ద కొంతసేపు యవ్వారం జేస్తుంది. ఆడాళ్లందర్నీ ఒకచోట చేర్చేందుకు విపరీతంగా కృషిజేస్తోంది.

రాత్రయ్యేసరికి వీధిలోని ఆడాళ్లంతా ఒకచోట కూచుని పక్కాకు నములూ మాటల్తో పొద్దుబుచ్చేందుకు ఇది పల్లె అనుకొంది కాబోలు.

ఆమె ప్రవర్తన నాకొంత అసహనంగానే వున్నా ఆశ్చర్యంగాకూడా వుంది - భాషరాని ఆడవాళ్లతో సైతం సైగలతో సంభాషించేందుకు ప్రయత్నిస్తోంటే.

అనంతపురం వ్యక్తి మా ఫ్లోర్‌లోకే వచ్చి వున్నాడు.

అతని జబ్బును తలచుకుంటే నవ్వొస్తోంది.

మధ్యాహ్నం ఇందిరకు చెబితే పడిపడి నవ్వింది.

నాకయితే అతని జబ్బును పరిశీలనగా చూడాలనిపిస్తోంది.

ఎవరో తావు కోసం వెదుకుతోంటే పిల్చి మరీ మా పక్క తావిచ్చింది ఇందిర. "యీన్నే వుండి సంసారాలు ఈస్పొండమా? ఒక పూట వుండి మరో పూటకు పోయేవాల్లం... మనం మనం సర్దుకోకుంటే ఎట్లా? అప్పుడే గడిచి గట్టెక్కినట్లా..." అంటూ సుభాషితాలు.

అంతదాకా తమ వద్ద వద్దంటే, తమ వద్ద తావు లేదంటూ మొండిచేయి చూపిన వాళ్లంతా ఇప్పుడు ఇందిరకేసి చూసే పొర చూపుల్ని ఆమె అస్సలు పట్టించుకొన్నట్టు లేదు.

కొత్త మనిషికి తావివ్వటం నాక్కొంత ఇబ్బందికరంగానే వుంది. పడుకొనేదే కింద. అందులో మరీ ఇరుకుగా ఎట్లా సర్దుకోవాలి?

ఇందిర మీద కోపమొస్తోంది.

తన పల్లె చేష్టలు ఏ మాత్రం వదలుకోలేదు ఆమె.

ఇంత మహానగరాన్ని కూడా ఆమె కుగ్రామంలాగే భావించుకొంటోంది. నగర వాతావరణానికి అనుగుణంగా మారకుండా నగరాన్నే తన అంకెకు తెచ్చుకోవాలని చూస్తోన్నట్లుంది.

తమ ప్రాంతపు పరిచయస్తులు లేరుగాబట్టి సరిపోయింది. లేకుంటే యీవిడ చేష్టలకు సిగ్గుటోయే పరిస్థితి.

రాత్రి చాలాసేపటి వరకు నేను చంద్ర ఆమెకు చెబుతూనే ఉండిపోయాము. నాగరికతను గురించి బోధిస్తూనే వున్నాము.

విన్నంత సేపు విని "సాల్లే సంబడము" అంటూ అటువైపు తిరిగి పడుకొంది.

తలపట్టుకొని నేను మరోవైపు తిరిగాను.

ఆమె అనాగరిక చేష్టలు మళ్లీ మళ్లీ కళ్లముందు మెదులుతోంటే నెమ్మదిగా రెప్పలు మూతపడుతున్నాయి.

అప్పుడప్పుడూ స్వీపర్ల నవ్వులు చెవుల సోకుతున్నాయి.

ఉన్నట్టుండి ఏదో మగగొంతు గట్టిగా అరచిన శబ్దం.

ఉలిక్కిపడుతూ కళ్లు తెరచి తలెత్తాను.

శబ్దం విన్పించిన దిశకేసి చూపులు పరువెత్తాయి.

పగలబడి నవ్వుతున్నాడు అతను. వికటాట్టహాసం చేస్తున్నాడు.. అనంతపురం వ్యక్తి. కూచునే నవ్వుతున్నాడు. విరగబడి నవ్వుతున్నాడు.

ఇంకా యవ్వారాలు చేస్తోన్న స్వీపర్లతోటి చాలా మంది బిత్తరపోయి అటుకేసి చూస్తున్నారు.

రెండు నిమిషాల నవ్వు తర్వాత భార్య సముదాయింపులతో మామూలు మనిషయ్యాడు అతను. అంతదాకా పగలబడి నవ్విన వ్యక్తి ఇప్పుడు ఏమీ ఎరగనట్లే మామూలుగా వున్నాడు. తన పడక సర్దుకొంటున్నాడు.

అతని భార్య మాత్రం చుట్టూ అందరి మొహాల్లోకి సిగ్గుగా చూస్తోంది.

వింతగా అన్పించింది నాకు.

అతని జబ్బేదో అర్థమైంది.

మెల్లిగా లేచి అతని వద్దకెళ్లాను.

"అంత గట్టిగా నవ్వినావెందుకు?" అడిగాను.

చిరునవ్వుతో నాకేసి చూస్తూ "నవ్విన్నా! ఏమో... నాకయితే గుర్తుండదు... ఏం లక్ష్మీ! నవ్విన్నా?" భార్యను అడిగాడు.

తలూపింది ఆమె.

"అదే సార్ నా జబ్బు. నవ్వొచ్చేది నాకు తెల్దు. నవ్విన విషయం కూడా తెల్దు... ఇబ్బందిగానే వుంది... ఎల్ఐసిలో పన్జేస్తున్నా. నా(పొఫెషన్‌కు కూడా ఆటంకంగానే వుంది. యాడేడనో సూపించినా... లాభం లేక యీడికొచ్చినా.." చెప్పాడు.

నవ్వు కూడా శాపంగా పరిణమించిన వైనం.

ఇందిర అమాయికత్వం యీ నవ్వుకంటే అపహాస్యమైందేమీ కాదనుకొంటూ నిద్రలోకి జారాను.

తమ హాస్పిటల్ నించి ఎలాంటి రిపోర్టూ బైటికి ఇచ్చేది లేదంటూ నిమ్‌హెన్స్ డాక్టర్లు చెప్పటంతో ఉదయం మణిపాల్ హాస్పిటల్ వెళ్లాము.

లిఫ్ట్‌లో ఎక్కటం, దిగటం, దగ్గర్లోని ఏరోడ్రోం నించి విమానాలు లేచి వాలే దృశ్యాన్ని కిటికీలోంచి చూడటం ఇందిరకు చాలా గమ్మత్తుగా అన్పించినట్లుందిగాని, ఆ ఆనందాన్ని వ్యక్తం చేయటంలో ఆమె ప్రదర్శించే హావభావాలు చాలా జతల చూపుల్ని మా మీదకు మళ్లిస్తున్నాయి అప్పుడప్పుడు.

ఆంజియోగ్రాం రిపోర్ట్ తర్వాత ఆపరేషన్ సంగతి ఆలోచిద్దామనుకొన్నాము.

రాత్రికి పేషంట్ వద్ద ఉండాల్సిన అవసరం లేదు కాబట్టి నిమ్‌హెన్స్ వెళ్లాము. బస్సు ప్రయాణంలో చలి తాకిడి ఎక్కువగా వుంది. రెస్ట్‌హౌస్‌లోని అనంతపురం మనిషి నవ్వు అన్ని చలిపోటుల్ని ఆవిరిజేసింది. ఇందిరకయితే అతన్ని తల్చుకొన్నప్పుడంతా పడీపడీ నవ్వుతోంది.

ఉదయం మణిపాల్ హాస్పిటల్ వెళ్తోంటే - బస్సులో కిటికీ వారగా కూచుని బైటకు చూస్తూ "అదేందీ?" అంది ఇందిర వేలెత్తి చూపిస్తూ.

పెట్రోల్ బంక్ అది.

"దాని ముందు అంత పెద్ద కల్లముందే! ఏం జేసుకుంటారు?"

బంకు ముందు కాంక్రీటు వేసిన విశాలమైన అవరణను కల్లం అనుకొంటోంది ఆమె.

వివరించి చెప్పాను.

"ప్చ్..." నిట్టూర్చింది. "అట్లాంటి తావు మనూరి పక్కుంటేనా.." అంది. నొసలు ముడేసి ఆమెకేసి చూశాను.

"నాలుగెకరాల వరిసెత్త ఒక్కసారే రాలగొట్టొచ్చు... ఎంత పెద్ద కల్లం..." చెప్పింది ఆలోచనల్లో మునిగిపోతూ.

నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు నాకు.

నగరంలో వుండే యీ నాలుగు రోజులైనా పల్లె వాసనలు వదిలేస్తుందనుకొంటే కుదిరేట్టు లేదు.

చంద్రను థర్డ్ ఫ్లోర్‌లోని మరో రూంకు మార్చారు.

ఆంజియోగ్రాం రేపు చేస్తారుట.

రూంలో ఇంకో పేషంట్ వున్నాడు. వయోవృద్ధుడు. పేరు నారాయణస్వామి. వెంటిలేటర్స్ ద్వారా ఆక్సిజన్ పంపిస్తూ బతికిస్తున్నారు. దాదాపు కోమాలోకి వెళ్లిన

స్థితి. కోటీశ్వరుడైన వ్యాపారవేత్త కాబట్టి అతనికోసం డబ్బును మంచినీళ్లలా ఖర్చు చేస్తున్నారు.

అక్కడ మమ్మల్నాకర్షించిన అంశం ఏమిటంటే -

అతన్ని పలకరించేందుకూ, ప్రతిస్పందనల్ని పొందేందుకూ ఇద్దరు కొడుకులూ శాయశక్తులా కృషి చేస్తున్నారు. ఏవేవో మాటలు చెబుతున్నారు, ప్రశ్నిస్తున్నారు, సలహాలు అడుగుతున్నారు, భక్తి గీతాలు పాడుతున్నారు. చిన్నకొడుకైతే నిర్విరామంగా తండ్రితో సంభాషిస్తూనే వున్నాడు. ఆయన ఊ కొడుతున్నట్లూ, సమాధానమిస్తున్నట్లూ బావించుకొంటూనే తెగ ముచ్చటల్లాతున్నాడు. ఎగిరిపోయే ప్రాణ వాయువు చివరి కదలికల్ని స్పురించేందుకు ఆరాటపడుతున్నాడు.

వాళ్లు తెలుగు వాళ్లు కావటం మాక్కొంచెం మేలుగా వుంది.

మధ్యాహ్నంనించి ఇందిరను వెంటేసుకొని బెన్నెరగట్ట నేషనల్ పార్క్‌కు బైల్దేరాను.

బస్టాండ్‌లో నిల్చుని వుంటే - కాల్చిన మొక్కజొన్న కంకులు కన్పించాయి.

బేరం జేసి రెండు కంకులు తెచ్చుకుంది.

నాకివ్వబోయిందిగాని వద్దన్నాను.

బస్సులో కూచుంది మొదలు కంకిని పళ్లతో పెరకటం మొదలుపెట్టింది. నాజూగ్గా వేళ్లతో వొలిచి గింజల్ని నోట వేసికొంటే ఇబ్బంది ఉండకపోను.

బస్సులో జనమంతా మాకేసే చూస్తున్న అనుభూతి.

చేత్తో వొల్చుకు తినమని చెప్పాను.

అట్లా రుచి వుండదట.

బస్సు దిగగానే మందలించాను.

మొహమంతా చిన్నబుచ్చుకుంది.

జూపార్క్‌లో చాలాసేపు గడిపాము.

ముఖ్యంగా - పెద్ద పులుల వద్ద ఎంతసేపయినా ఉండాలనిపించింది. కంచెకు అవతల రెండు పులులు అటు ఇటు అదేపనిగా పచార్లు చేస్తున్నాయి. ఒకదానికొకటి ఎదురవుతూ నిరంతరాయంగా తిరుగుతున్నాయి. కంచె వారగా వంద గజాల పొడవున రాజసం వొలకబోస్తూ అడుగులేస్తున్నాయి. చుట్టూ మూగిన జనం కేసిగాని, లోపల పదుల సంఖ్యలో వున్న మిగతా పులుల కేసిగాని కళ్లెత్తి కూడా చూడటం లేదు. అంతులేని నిర్లక్ష్యంతో, తిరుగులేని ఠీవితో పచార్లు చేస్తున్నాయి. రాజసాన్ని భంగ పరచాలని ప్రయత్నిస్తున్నారు. వాటి ఏకాగ్రతకు తూట్లు పొడవాలని చూస్తున్నారు. అవి తమ చేష్టలకు ప్రతిస్పందించేలా చేయాలని అవస్థ పడుతున్నారు.

సన్నటి గులకరాళ్లతో వాటిని కొడుతున్నారు.

పుల్లలతో పొడిచి వాటి దృష్టి మళ్లించాలని చూస్తున్నారు.

పుల్ల గుచ్చుకొంది కాబోలు ఒక్కసారిగా బుసలు కొట్టి పంజాతో కంచెకేసి బాదింది పులి.

వెంటనే చేయి వెనక్కు లాక్కున్నాడు ఆ కుర్రాడు.

నవ్వులు... కేరింతలు...

వాటి పచార్లు చూస్తోంటే - లోపల బంధించినందుకు అంతులేని అసహనంతో పేట్రేగిపోతున్నట్లుగా అన్పించింది నాకు. మనిషనేవాడు దొరికితే ఒక్క దెబ్బతో వాడి తల పగులగొడుతుందేమో అన్పించింది.

పుల్లతో పొడిచి పులిని రెచ్చగొట్టటం తమాషా ఆటగా తోచింది కాబోలు ఆకతాయిలకు - మరింత రెచ్చిపోతున్నారు.

నాకయితే నిర్లక్ష్యంతో కూడిన పులి రాజసాన్నీ, నడిచేప్పటి దాని శరీరపు పొందికనూ అదేపనిగా కళ్లార్పకుండా ఎంతసేపు చూసినా తనివి తీరటం లేదు.

పులి పంజా విసిరినప్పుడంతా కంచెకున్న రంధ్రాల్లోంచి ఒడుపుగా చేతిని లాక్కొని హీరోలా ఫోజులిస్తున్నాడు ఓ యువకుడు.

"ఓబ్బీ! కరుస్పది... దూరంగా పో.." అంటూ ఇందిర హెచ్చరిక.

వాళ్లకు తెలుగు రాదు గాబట్టి సరిపోయింది.

అక్కడక్కడా తెలుగు అర్థమైనవాళ్లు ఆమెకేసి అదోలా చూస్తున్నారు.

ఉన్నట్టుండి కెవ్వుమనే కేక.

చేయి వెనక్కి తీసికొనే లోపలే మెరుపు వేగంతో పంజా విసరినట్టుంది పులి. పంజాదెబ్బ యువకుడి చేతిమీద బలంగా పడింది.

అదృష్టం ఏమిటంటే - పులి నోటికి చేయి చిక్కకపోవటం.

"సరిపోయిందిలే - పెండ్లీ నాగేలి రొండూ కుదిరినాయి..." ఇందిర అంది.

ఆమెకేసి ఓ రకమైన చిరాకుతో చూశాను.

రాత్రి రెస్ట్‌హౌస్ బైట అరుగు మీద కూచుని చాలాసేపు ఆమెకు హితబోధ చేశాను. మాటతీరు, నడవడిక తీరు మార్చుకోమని చెప్పాను. మందలించాను చివరగా అన్నాను "నిన్ను వెంటబెట్టుకెళ్లాలంటే నాకు సిగ్గుగా వుంది" అని.

మరేమీ మాట్లాడకుండా లోపలికి నడిచింది ఆమె.

ఉదయం మణిపాల్ హాస్పిటల్ వెళ్లేందుకు ప్రయాణమై ఇందిర కోసం నిరీక్షిస్తోంటే తను చెప్పింది 'నేనురా'నని.

"ఏమీ?" అడిగాను.

"నేనీన్నే వుంటా. నువ్వు పోయిరా!"

"ఎందుకని?"

"యీ మొరటుదాన్ని నువ్వేమీ ఎంటబెట్టక పోవొద్దులే..." చెప్పింది.

అలిగింది కాబోలు.

చిన్నగా నవ్వాను "రా... రారా..." పిల్చాను.

"రానంటే..."

"నేనెందుకు చెప్పిన్నో అర్థం జేసుకో.." అన్నాను దగ్గరగా వెళుతూ. "ఏమీ తెలీనోల్లు కూడా టౌన్లో ఒక్కరోజుంటే మారిపోతున్నారు... నువ్వు మారకుంటే ఎట్లా?"

"మారి... యీన్నే వుందామా?" నా కళ్లల్లోకి సూటిగా చూస్తూ అంది. "మనూరికి పొయ్యేది లేదా?"

"పోతే...?" నొసలు ముడేశాను.

"వూర్లేకి పోతానే మల్లా ఆ మొరటోల్ల మాదిరి మారొద్దూ?"

అయోమయంగా చూశాను.

"పల్లెదాన్ని పల్లెదాన్నట్లా వుండక ఎట్లుంటా? కొత్త తావు కొచ్చినపుదంతా కొత్తగా మారి కొత్త కూతలు కుయ్యాలంటే నేనేం అయ్యగారి ముసిలి బాపనమ్మను గాదు. మనూరి మాటలే నేను మాట్లాడతా. నీయట్లా ఆ వూరు దిరిగి ఒకమాటా యీ వూరు

దిరిగి ఒకమాటా నేన్నేర్చుకోలే... నీకు వూరు గబ్బుద్దైంది. టౌను గమగమలాడ్తాంది. నియ్యట్ల నేను ఆడొక మాసిగా యీడొక మాసిగా మారలేను.." కరుగ్గా చెబుతూ వెనుదిరిగి విసవిస వెళ్లిపోయింది.

నిలువు గుడ్లు పడ్డాయి నాకు.

ఆమెలో ఇంత అసహనం ఎప్పుడూ చూల్లేదు.

మరేం మాట్లాడకుండా మణిపాల్ హాస్పిటల్‌కి బైల్దేరాను.

బస్సెక్కి సీటులో వాలి కళ్లు మూసికొంటే ఇందిర అసహనపడిన తీరే కనుపాపల మీద మెదలసాగింది.

ఆమె స్థానంలో హఠాత్తుగా నిన్నటి జూపార్క్‌లోని పులి ప్రత్యక్షమైంది. అదే అసహనం.. కంచె బాతి బైట్నించి రాళ్లు విసిరి ఆడుకొన్న జనం పట్ల అసహనం... పులి స్థానంలో ఇందిర... ఇందిర స్థానంలో పులి..

నవ్వొచ్చింది నాకు.

మణిపాల్ హాస్పిటల్ వెళ్లేదాకా అవే దృశ్యాలు పదేపదే... ఆమె అలక దృశ్యాలు.. ఆమె ఆవేశపు దృశ్యాలు.. అసహనం వెళ్లగక్కే దృశ్యాలు... బోనులోపలి పులి దృశ్యాలు.. పులితో కరచాలనం చేసే దృశ్యాలు.. [illegible]తో కరచాలనం...

చంద్రకు ఆంజియోగ్రాం చేశారు.

అతన్ని రూంకు తెచ్చేసరికి రాత్రయింది.

స్పృహలో లేదు.

రాత్రంతా పేషంట్ వద్ద జాగ్రత్తగా మేలుకొని సెలైన్‌లు మార్పించటం వగైరాలు చేస్తుండాలిట.

డాక్టర్‌తో మాట్లాడితే ఆపరేషన్‌కు దాదాపు లక్షరూపాయల దాకా ఖర్చవుతుందని చెప్పాడు. పదివేలవుతుందనుకొన్న ఆంజియో ఖర్చు కాస్తా పదిహేను వేలదాకా చేరుకొంది. ఆపరేషన్ ఖర్చు మాత్రం చెప్పినంతే ఎందుకుంటుంది? ఇంటికెళ్లి డబ్బు సమీకరించి మరోసారి రావాల్సి వస్తుందేమో!

పక్క బెడ్ మీది పేషంట్ నారాయణస్వామి వద్ద చిన్నకొడుకే కాపలా వున్నాడు.

మాటల సందర్భంలో తండ్రిని గురించి చెప్పుకొచ్చాడు.

ఎప్పుడో నలభై యేళ్ల క్రితం అనంతపురం జిల్లా ధర్మవరం నించి పైపంచె భుజానేసికొని వచ్చాడుట ఆయన. డబ్బా నూనె వ్యాపారంతో జీవితం మొదలెట్టాడుట. అంచలంచెలుగా వ్యాపారాన్ని అభివృద్ధి చేసి యింత పెద్ద ఆస్థిని సంపాదించాడుట. ఈనాటికీ వ్యాపార విషయాలలో సలహాలిస్తూనే వుంటాడుట.

తండ్రిని మాట్లాడించాలని ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తున్నాడు అతను. ఏవేవో విషయాలు చెబుతున్నాడు. బంధువుల బాగోగుల గురించీ, దేవస్థానాల గురించీ, స్థానిక రాజకీయాల గురించీ, తన ఫ్రెండ్స్ గురించీ సవాలక్ష విషయాలు చెప్పటం... ప్రశ్నించటం.. సలహాలు అడగటం.. దేనికీ స్పందించలేదు ముసలాయన.

నాకయితే వృధా కంఠశోష అన్పించింది.

ముసలాయన కోమాలోకి వెళ్లాడు. ఇప్పుడో ఇంకాసేపట్లోనో మరణిస్తాడు... తప్పదు.. అనుకొన్నాను.

ఇందిర గురించిన ఆలోచనలు మనస్సును కమ్మాయి.

అప్పుడే ఓ విచిత్రం జరిగింది.

"నాన్నా! ఓ నాన్నా!... పెద్దన్న బిజినెస్ స్టార్ట్ జెయ్యాలని రూం కూడా తీసినాడు. ఆయిల్ బిజినెస్ చెయ్యాలనుకొంటున్నాడు. నీ సలహా కోసం వొచ్చినాడుగాని నువ్వప్పుడు నిద్రబోతా వుంటివి. లేపడమెందుకులే అని వెళ్లిపోయినాడు. ఆయిల్ బిజినెస్ ఆ ఏరియాలో జరుగుతుందంటావా నాన్నా!" చెవి దగ్గరగా నోరుంచి అడుగుతున్నాడు ఆ యువకుడు.

వెంటనే ముసలాయన మొహంలో ఏదో మార్పు.

గొంతులోంచి గురుగుర శబ్దం.

మరోసారి అదే సమస్యను చెవివద్ద నివేదించాడు.

ముసలాయన పెదాలు కదిలాయి. ఏదో మాట్లాడుతున్నాడు.

కొడుకు అర్థం చేసికొన్నాడు.

"రూమెక్కడనా?.. అదీ... యీన్నే..." అంటూ లొకేషన్ చెప్పాడు.

కొద్దిక్షణాల తర్వాత ఏదో సలహా యిస్తోన్నట్లుగా ముసలాయన పెదాల కదలికలు.

అదో అద్భుతమనిపించింది నాకు.

ప్రపంచంలోని ఏ విషయాలకూ స్పందించని ఆయన మనస్సు - తన్నింతవాన్ని చేసిన వృత్తి పట్ల స్పందించింది. ఇంకా ఉపయోగపడబోతోన్న తన అనుభవాన్ని అందించేందుకు స్పందించింది. పనినే దైవంగా భావించాడు. కాబట్టి జీవితపు చివరి అంచుమీద ఆ పనే దేవుడై వచ్చి కూచుంది. తనలోకి ఆయన్ను తీసికెళుతూ వుంది.

ఇందిర గుర్తొచ్చింది.

తను కూడా ఇలాగే స్పందిస్తోందేమో! తన పల్లె పట్లా, తన చుట్టూ పరివేష్టించిన పరిసరాల పట్లా, తన భావాల్ని సులభంగా వ్యక్తీకరించగలిగే పల్లె మాండలిక భాష పట్లా, తన వాళ్లు సంకోచం లేకుండా నిర్వహించే వ్యవహారాల పట్లా, సంస్కృతుల పట్లా, సంప్రదాయాల పట్లా, అలవాట్ల పట్లా... ఆయనలాగే...

రెస్ట్‌హౌస్‌లో స్వీపర్లను కూడా తనతో కలుపుకుపోవటం, నగరపు అందాలను తనదైన శైలిలో స్పందించటం, హృదయంలోని భావాల్ని సంకోచం లేకుండా వ్యక్తీకరించటం, తనను ఇన్ని రోజులూ మనిషిగా నిలిపిన పల్లె భాషను జంకుగొంకు లేకుండా నిజాయితీగా ప్రయోగించటం... వీటన్నిటికీ కారణం ఆమె పల్లెదనమే.

ఆ పల్లెదనాన్ని మార్చుకోమనే గదా తను చెప్పేది.

ఇదేంటి? పల్లెలోనే బతుకుతూ పల్లెదనాన్ని వదిలేయమనటంత... ప్రత్యేకంగా జీవించమనటం...

'నాగరికత' అనే విషయాన్ని తను సరిగ్గా అర్థం చేసికోలేక పోవటం వల్లే యీ చిక్కులు వస్తున్నాయో!

బహుశ - ఇందిర నా ప్రవర్తనను తల్చుకొని లోలోపల నవ్వుకోవటం లేదు గదా! నన్ను కూడా నవ్వ రోగి సరసన నిల్చోబెట్టి చూడటం లేదు గదా!

● సాహిత్యనేత్రం - ఏప్రిల్ - జూన్ 2008 ●